# కామన్‌వెల్త్

ఎల్లాకర్ విచిత్రమైన మనిషి. వాడు ఎపుడు దేన్ని విమర్శిస్తడో, దేన్ని ప్రశంసిస్తడో తెలువది. విమర్శించినపుడు యింతెత్తున గొంతెత్తి లొల్లి పెడుతడు. ప్రశంసిచాలనుకుంటే లొల్లి పెట్టినంత అలుకగనే ప్రశంసిస్తడు. ఇంతకు ముందోసారి విమర్శిస్తివి గదా అంటే అది అప్పటికి కరెక్టు. ఇది ఇప్పుడు కరెక్టు అంటడు తప్ప తనది ఎన్నడూ తప్పని ఒప్పుకోడు. నరం లేని నాలుక ఎట్లయిన మాట్లాడ్తవులే అని ఎవలన్న దెప్పితే "అంతా మన మంచికేనే" అని నవ్వుతడు తప్ప వాదనలకు దొరకడు. వాడు సగటు భారతీయుడు.

విజయలక్ష్మి భర్త చనిపోయి ఏడుస్తుంటే అంతా మంచికే జరిగింది అన్నడు ఎల్లాకర్. చావు పందిట్ల నాతోని అన్నడు గాబట్టి సరిపోయింది. ఎవరైనా వింటే గల్లా వట్టి తరిమెటోల్లు. "ఛ నోర్మూయి నువ్వు మనిషివి కాదుర" అన్న విసుగ్గ.

"రోజూ తప్ప తాగి కొట్టే భర్త ఆక్సిడెంటులో పోవడం మంచి కాకుండ చెడు ఎట్ల అయితది" అని చావు పందిట్లో ఎల్లాకర్ గుసగుసగా నాతో వాదనకు దిగడం ఆశ్చర్యమనిపించింది. వీడు నిన్నటి దాకా అందర్ని అదరగొట్టుకుంట విజయలక్ష్మి భర్త పోషేందర్‌ను సమర్థించిన బాపతు.

"పోషేందర్‌కు ఏవో చెప్పలేని బాధలురా! ఎవరూ తన బతుకును, ఆరోగ్యాన్ని పాడుజేసుకోవాలనుకోరు. తన పైసలే పాయె. తన పరువూ, ఆరోగ్యమే పాయె. తనకు తానే శిక్ష వేసుకునె. విమర్శించి మనం దూరం గొడ్తె ఒకే తప్పుకు రెండు శిక్షలు

వేసినట్టయితది. ఇంకింత తాగుబోతైతడు. వాని మీద జాలి చూపాలెరా, కోపం కాదు. అదే మానవత్వం" అని వాదించిండు ఎల్లాకర్. అదే మాట యాది జేసిన.

"అప్పుడది వాని తరుపున కరెక్టు. ఇపుడు విజయలక్ష్మి వైపు నుంచి కరెక్టు. అరె వెంకులూ! కాస్త నిదానంగా, నిజాయితీగా, నిర్భీతిగా ఆలోచించుర. ఇపుడు పోయినోని గురించి ఆలోచించుడు కాదు. ఉన్నోల్ల గురించి ఆలోచించు. ఆ తాగుబోతు వెధవతో విజయలక్ష్మి ఎన్నడయినా సుఖపడిందంటవ? ఇపుడా బాధలన్ని తీరినై. వాని ఉద్యోగం ఆమెకిస్తరు. పెన్షను, గ్రాట్యువిటి కూడా వస్తది. సోషల్ లైఫ్ పెరుగుతది. మునిపటి కన్నా ఈ జీవితమే ఆమెకు బంగారు జీవితం. పిల్లల్ని చదివించి పెద్ద జేయవచ్చు" నా మీద వానికి హక్కుందని అదరికి తెలువాలని వేంకటేశ్వర్ అనకుంట నన్ను వాడు వెంకులూ అని పిలుస్తుంటడు.

మాటల్లోనే శవం ఊరేగింపు బయల్దేరింది. ఏడ్పులు మిన్ను ముట్టినై. చెరో పక్క జేరి పాడె మోసినం కొంతసేపు. దహన క్రియల్ని దగ్గరుండి జరిపించిండు ఎల్లాకర్.

చనిపోయిన మూడో రోజు పక్షికి పెట్టుడు. దగ్గరి వాల్లను పిలిసిన్రు. కాలేసిన శ్మశానం పక్కనే చెట్లల్లో బోయినాలు. ఆ పని ఈ పని పురమాయించుకుంట ఎల్లాకర్ మల్ల అదే చర్చ మొదలు పెట్టిండు. విజయలక్ష్మిని ఏడుస్తుంటే మా శారద ఊకుంచి నా పక్కన ఏదో చేప్తామని చేరింది. మా శారదనే అడిగింది.

"మీరన్నది నిజమే అన్నయ్యా! కాని ఎంతైనా భర్త లేని లోటు తీర్చగలిగేది కాదు గదా! తల్లిగారైనా గట్టిగుండాలె. భర్తన్న ఉండాలంటరు. అన్ని సుకాలుండి ఏం లాభం భర్త పోయినంక"

అట్లా అడుగుతున్నప్పుడు మా ఆవిడ ముఖం ఏదో తేజస్సుతో వెలిగిపోతున్నది. ఎవరో పిలిచేసరికి మా శారద అక్కన్నుంచి కదిలింది. నా మిసెస్ గట్లడిగే సరికి నా గుండె గతుక్కుమన్నది. అకస్మాత్తుగా డౌటొచ్చింది.

"అరే ఎల్లాకర్! ఈ ఆడోల్లంత మొగుడు పోతేనే ఎక్కువ సుఖం అనుకుంటరా ఏంది? మా శారద "భర్త లేని భార్య ఉత్తమురాలు ఓయమ్మా! ఓయమ్మా!" అని పాట మార్చి పాడుతున్నట్టు ఆ మొహంలో అంత వెలుగేంటిదిరా?"

"నీ తలకాయ! శారద మొహంల ఉన్న కళ, వెలుగు నువ్వేరా! నా మొగుడు నాకున్నడు అని తృప్తి, ఆత్మ విశ్వాసంతో ఆమె వెలిగిపోతుంటే ఇలా పెడర్థాలు తీయాలని నీకెట్ల బుద్ధి పుట్టిందిరా" అని నోరు మాయించిండు ఎల్లాకర్.

మల్ల కొంచెం సేపటికి శారద మా దగ్గరికచ్చింది. ఎల్లాకర్ మల్ల మొదలు పెట్టిండు. "శారదా! ఈ కాలంలో భర్త లేకపోవడం అనేది మునుపటి తీర్గ పెద్ద లోపం కాదు. అన్ని కావాలెగని భర్తలు మాత్రం వద్దని ఫెమినిస్టులు ఉద్యమాలు చేస్తున్న కాలం ఇది. అంతగా అవసరమనిపిస్తే భార్య కోల్పోయినోన్నో, యువకున్నో చేరదీసి గుట్టు రట్టు కాకుండా ఎంతమంది సంసారం జేస్తలేరు. లోకం గూడ చూసి సూడనట్టుంటది. సమాజంల ఇపుడా సంస్కారం వచ్చేసింది. మీ లలిత చిన్నమ్మను ఇపుడు ఎవరైనా వేలెత్తి చూపుతున్నరా చెప్పు. సిద్ధాంతం, రాద్ధాంతం చేయకుంటె ఎట్లయిన బతకచ్చు. "శుక్రనీతి" అని ఒకటున్నది. ప్రపంచంల చట్టాలు, నీతులు, విలువలు ఎన్నో తయారు జేస్తరు. దానికి కొన్ని మినహాయింపులిస్తరు. ఈ మినహాయింపులకు కూడా కొన్ని నైతిక విలువలు, సందర్భాలుంటయి. ప్రపంచంల వాటినే శుక్రనీతి అంటరు. ఎందరు ఎన్ని జెప్పినా చివరకు శుక్రనీతినే ఆచరిస్తరు. ఆ మాట ఓసారి ఒప్పుకుంటరు. ఓసారి ఒప్పుకోరు. గంతే" అన్నడు ఎల్లాకర్.

ఎల్లాకర్‌కు ఉదాహరణల కొరత లేదు. మా శారద వాళ్ల చిన్నమ్మను ఓసారి గొల్లెం బెట్టి రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నరు. "మా యిష్టం తోటి కల్సి ఉంటున్నం. మీరెవలు, మీరు మీ పెండ్లాల దగ్గర, మొగల్ల దగ్గర పంటలేరా! నేను గూడ మీ తీర్గనే బతుకుతున్న. మీ తీర్గనే సిన్మాలు జూస్తున్న. అని లలిత లొల్లి పెట్టింది. రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నది గూడ నయమే అయిందిర. ఇపుడామె బాజాప్తగ అతన్తోని కల్సి ఉంటున్నది అన్నడోసారి ఎల్లాకర్.

ఇట్లా అక్రమ సంబంధాలను "శుక్రనీతి" అనుకుంట అవేవో పవిత్ర సంబంధాలన్నట్టు ఎల్లాకర్ మా శారదకు ఊరించి చెప్తుంటే నాకు ఒళ్లు మండింది. మా శారద ఇష్టం లేనట్టు నటిస్తూనే ఆసక్తిగా వింటున్నది.

పక్షికి పెట్టే కార్యక్రమం కొంచెం తక్కువ వనబోయినాల తీరైపోయినై. పోషేందర్ పోయిండనే బాధ ఎక్కడా కనపడలేదు.

పదకొండో రోజునాడు విజయలక్ష్మి బొట్టు, గాజులు, మట్టెలు పగులగొట్టి తెల్లచీర కట్టిస్తుంటే మా శారద మరో యిద్దర్ని వెంటేసుకుని అది దుర్మార్గం అన్నది. బొట్టు మొగునితోని రాలేదు. చీరెలు మొగనితోని రాలేదన్నది. మంగళసూత్రం మట్టెలు తీసేస్తే తీసెయ్యిని అని వాదనకు దిగింది. నువ్వన్న చెప్పు అన్నయ్య అని ఎల్లాకర్‌ను మద్దతు రమ్మన్నది శారద.

ఎల్లాకర్ విచిత్రంగా వాదించడం ఆశ్చర్యమనిపించింది. విధవను చేసే కార్యక్రమం నిజంగా భయంకరమైనది. అది అందరు అంగీకరిస్తరు. ఎల్లాకర్ మరో రూట్లో వచ్చిండు.

"శారదా! పోనీతియ్యి! ఆ పాత జ్ఞాపకాల్ని అలా పగులగొట్టడమే మంచిది. గతం తాలూకు, భర్త తాలూకు గత చిహ్నాలేవీ లేకుండా వుంటేనే ఆమె తొందరగా కోలుకుంటది. కొత్త జీవితం గెలుచుకుంటది. ఆ బంధాలన్ని తొలిగితే ఆమెకే మంచిది" అని వాదించిండు ఎల్లాకర్.

ఎల్లాకర్ వాదన వింటే ఎంత ఛాందసుడైనా బొట్టు గాజులు, పుస్తెలు పగులగొట్టాలని మాత్రం అనుకోరు. తన ఆస్తిలో వాటాను, పెన్షన్‌ను అనుభవిస్తున్నప్పుడు ఆమె చనిపోయేదాకా తాను కట్టిన మంగళసూత్రం పెట్టిన బొట్టు ఆమె మెడలోనే ఆమె జీవితాంతం ఉండాల్సిందేనని చట్టం తేవాలని ప్రతి భర్త కోరుతాడు. అదే ఎల్లాకర్ రివర్స్‌గేర్ తర్కం ప్రత్యేకత. ఎల్లాకర్ వాదన విని మా శారద అర్ధాంగీకారంతో మౌనంగా ఉండిపోయింది.

ఏడాది గడిచిపోయింది. విజయలక్ష్మి కొద్ది నెలల్లోనే కోలుకున్నది. ఉద్యోగంలో చేరి తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇపుడామె బొట్టు, గాజులు పెట్టుకుంటున్నది. తనకు నచ్చిన చీరెలు కట్టుకుంటున్నది. విజయలక్ష్మి ఎల్లాకర్‌తో స్వచ్ఛంగా నవ్వుతూ మాట్లాడుతుంటే నాకు అనుమానం. ఎంత దగ్గరివాల్లయినా కొన్ని అడగలేము. చర్చించలేం.

ఓ రోజు వాడే ప్రస్తావన తెచ్చిండు. "అరే వెంకులూ! భర్త ఆస్తిపాస్తులు పొందిన భార్య మళ్లీ పెళ్లి చేసుకోవద్దు అని రూల్సు రాసినోడెవడో పెద్ద శాడిస్టురా! పిల్లలకు మంచి భవిష్యత్తు కోసం తండ్రి ఉన్నాడనే ఆత్మవిశ్వాసంతో పెరగడానికైనా మళ్లీ పెళ్లి అవసరం గదా! మొదటి భర్తకు పుట్టిన పిల్లలు, మొదటి భర్త వంశం కూడా ఎంతో ఉన్నతంగా నిలబెట్టినవుతుంది. మన ఎనుకటోల్ల బుర్రలన్నీ స్వార్థంతో కూడుకున్న మట్టి బుర్రలురా! తన వంశమే నిలవడ్తదని తెలియక మల్ల పెండ్లి చేసుకోవద్దనుడు అమాయకత్వమో, మూర్ఖత్వమో కాదంటావా!"

ఎల్లాకర్ అన్నదాన్లో నిజం లేకపోలేదు. మా శారద చిన్నమ్మ పిల్లలిపుడు వెంకటనారాయణను బాబాయి, బాబాయి అని పిలుస్తున్నరు. నాన్న అని పిలవడం లేదనేది తప్ప అతను ఎప్పుడు ఆ పిల్లలను వేరే తీరు చూడలేదు. పిల్లలు గూడ అతన్ని కన్నతండ్రి కన్నా వేరుగా చూడలేదు. ఈ మధ్యనే పెద్దమ్మాయి పెళ్లి చేసిన్రు.

లలిత, వెంకటనారాయణలే కాళ్లు కడిగిర్రు. పెళ్లి చేసిర్రు. ఎవరూ పెద్దగా అభ్యంతరం చెప్పలే. అభ్యంతరం చెప్పెటోల్లు ఆ పెండ్లికే రాలే. మా శారద చిన్నమ్మ పెద్ద కొడుక్కి పేమెంటు కట్టి బిఇడిలో చేర్పించిండు వెంకటనారాయణ. ఇంట్ల కొద్ది గంత గడబిడ అయిందిగని. మీకు మాత్రం ఏం తక్కువ జేసిన అని వెంకటనారాయణ సముదాయించేసరికి మల్ల ఎవరూ ఎదురు చెప్పలేదు. ఎల్లాకర్ ఇపుడు వెంకటనారాయణ రూట్లో పడ్డడా అని డౌటొచ్చింది. ఓ రోజు వాడే తీర్చిండు.

"అరే వెంకులూ! ఇపుడో చిక్కచ్చిపడ్డదిరా!" అంటూ కథంతా వివరించిండు. అయితే ఆ కథలో హీరో ఎల్లాకర్ కాదు. అతడు పెండ్లి పెద్ద.

"మొన్న విజయలక్ష్మి చాలా సేపు మాట్లాడింది. రాజేశ్వర్ గురించి నీ అభిప్రాయం ఏమిటి! రాజేశ్వర్ గూడ నిన్నే అడుగుమన్నడు అన్నది. ఇట్ల అడిగిర్రంటే మేం కల్సి జీవించడానికి మీరు అంగీకరించుర్రని అని కోరుడు తప్ప ఇన్ల మనం చేసేదేమున్నదిరా! రేపు ఏదైనా మీరే మా పెద్దలుగా తోడుండి పరిష్కరించాలని చెప్పినట్టిది" అంటూ ఆగి మా శారదకేసి చూసిండు ఎల్లాకర్.

ఆ రాజేశ్వర్ ఎవరో కాదు. మా శారద తమ్ముడే. మా బామ్మర్ది. పెండ్లయి నాలుగేండ్లు నిండకుండనే పొరపొచ్చాలొచ్చినై. యాడాది నుంచి కోర్టులో విడాకుల కేసు నడుస్తాంది. ఇట్లా విజయలక్ష్మికీ, రాజేశ్వర్‌కూ లీగల్‌గా ఆమోదముద్ర లేని పెండ్లి అవసరం.

"నువ్వేమన్నవుర" వాని వాదన రెండు వైపుల పదునున్న కత్తి అని తెల్సి ముందే అడిగిన. వాడు నా కన్నా రెండాకులు ఎక్కువ చదివిండు. నాకు చిక్కలేదు.

"నిన్నూ, శారదను తెల్సుకోకుంట ఏ సంగతీ చెప్పలేను అని అన్న"

వారం పది రోజుల తర్జనభర్జనలు జరిగినై. అన్ని తీర్ల ఆలోచించి వాడూ, నేనూ, మా శారద ఒక నిర్ణయానికచ్చినం.

రాజేశ్వర్, విజయలక్ష్మి కల్సి ఓ రోజు దగ్గరి వాళ్లనుకున్న ఏడెనిమిది మంది ఫ్యామిలీలను బోయినానికి పిల్సిర్రు. మేం గూడ వాళ్లను బోయినానికి పిల్సి చీరె, డ్రెస్సు కూడా పెట్టినం. ఇద్దరు కల్సి మంచిగనే బతుకుతున్నరు.

కొంత కాలమైనంక రాజేశ్వర్ మీద ఉరుములేని పిడుగు తీరు విరుచుకుపడ్డడు ఎల్లాకర్. విజయలక్ష్మి, నేను, మా శారద అందరం ఎవర్ని సమర్థించాల్నో తెల్సుకోలేకపోయినం.

"గ్లోబలైజేషన్, అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలకు శత్రువు అని కొందరు ఊదరగొడ్తున్నరు. అంతర్గత వైరుధ్యాల నుంచి దృష్టి మళ్లించడం కోసం పాలకవర్గాల్లోంచి ఒక సెక్షన్ పనిగట్టుకొని ఈ ప్రచారం చేస్తున్నది. వాల్ల నోరు పెద్దది. అదే నోరు తోటి భారతదేశ ప్రజలకు కుల వ్యవస్థ కులాంతరాలు అంతర్గత ప్రథమ శత్రువు. ఈ దేశం అగ్రరాజ్యంగా ఎదకపోవడానికి కులమే ప్రధాన అడ్డంకి అని వీల్లెందుకంటలేరో ఎరుకేన? వాల్లంతా కుల వ్యవస్థ వల్ల అన్ని రకాలుగా లాభపడెటోల్లు గాబట్టి" అని అన్నడు ఎల్లాకర్.

ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్, ప్రపంచ బ్యాంకు, గాట్ వీటన్నిటిని ఎందుకు వ్యతిరేకించాలో ఇన్ని రోజులు ఊదరగొట్టిన ఎల్లాకర్ యిట్ల ప్లేటు ఫిరాయిస్తే మాకేం సమఝ్ కాలేదు. అతని వాదన అతనికే విన్పించినం.

"ఒరే వెంకులూ! చరిత్రను అధ్యయనం చేసెటోల్లు ఒక విషయం అంగీకరిస్తరు. మన దేశంల ఏ మార్పయినా విదేశీయుల రాకపోకలు లేకుంట రాలేదు. నాటి ఆర్యులు, మొన్నటి ముస్లింలు, నిన్నటి యూరోపియన్లు, వీల్ల రాక వల్లనే నిలకడగా ఉన్న వ్యవస్థలు కదలబారినై. కుల వ్యవస్థలో మార్పులచ్చినై. అంతెందుకు? మన దేశంలో వచ్చిన కబీరు, గురునానక్, రామానంద, రామానుజ, చైతన్య, గురు రవిదాసు, తుకారాం భక్తి ఉద్యమాలు గూడ ఇస్లాం ప్రభావం వల్లనే తమ మతాన్ని తాము సంస్కరించుకునటానికి వచ్చినయే గద. రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం సంస్కరణలు బ్రిటిషోల్లు పరిపాలనలో లేకుంటే సాధ్యమయ్యేటియేనా?" అని ఎల్లాకర్ అడిగితే ఏం చెప్పలేక... ఇంకా ఏం చెప్తడో అని ఊకొట్టిన.

"ఇగో శారదా! ఈ దేశంలో ఆధునిక విద్య, వైద్యం, పరిశ్రమలు యూరోపియన్ల వలస వల్లనే అభివృద్ధి చెందినై. వాల్ల ప్రభావం, వాల్ల పరిపాలన ఉండుట్లనే అందరికి సమాన హక్కులు, ఇంత మంచి రాజ్యాంగం సాధ్యమైనై. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లచ్చినై. అదే దోపిడి కులాలోల్లు పరిపాలనలో ఉంటే ఇవేవీ సాధ్యమయ్యేటివా! బీసీలకు యాభయి ఏండ్లయినా రాజకీయ రిజర్వేషన్లు యిస్తలేరు గద. ఇది జాలదా మనోల్లు అవతలోడు లేకపోతే ఎంత కరుడుగట్టుకుపోతరో చెప్పటానికి. అందువల్ల సమాజాన్ని మళ్లీ కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, వేదకాలంగా వెనకకు నడిపిస్తున్న హిందూవాదులకు విరుగుడు పరిష్కారం విదేశీ సంపర్కంలోనే ఉంది. గ్లోబలైజేషన్లోనే ఉంది. పైగా దీన్ని అడ్డగించడం ప్రపంచంలో

ఏ దేశానికీ సాధ్యం కాదు. సాధ్యం కాన్ది పట్టుకొని వల్లించుకుంట, వ్యతిరేకించుకుంట కూర్చునే బదులు, జరగగలదాన్ని ఊహించి అందులో ముందుండి నడవడం తెలివి గలోల్లు చేయాల్సిన పని. హిందుత్వవాదులే వాల్ల అవసరాల కోసం గ్లోబలైజేషన్ను ఆహ్వానిస్తుంటే నువ్వు నేను వద్దనుడెందుకు చెప్పు?"

"అరే ఎల్లాకర్... ఈ దేశంలో వృత్తి ఉపాధి అవకాశాలు కోల్పోయి పేదోల్లకు తిండి లేకుంట గాదా! వాల్లందరు ఎట్ల బతకాలె?" అని అడిగిన.

"ఆ.. ఇప్పుడు పేదోల్లు మంచిగ బతుకుతున్నరనుకుంటున్నవా? అరవై శాతం జనాభా దారిద్రాన్ని తలకెత్తుకొని బతుకుతున్నరని ప్రభుత్వమే చెప్తున్నది. వాల్లకున్నది బుడ్డగోచి. బుడ్డగోచి కన్న పేదరికం యింకేముంటది. మహా అయితే యింత బుడ్డగోచి ఊడపీక్కుంటరు. అంతేగదా! అయితే "సామ్రాజ్యవాద సంక్షేమ అర్థశాస్త్రం" ఏం చెప్తున్నదో ఎరికేనా? బుడ్డగోచి గూడ లేకుంటైతె అమరికోడు ఏమమ్ముకుంటడు. మనోల్ల కొనుగోలు శక్తి పెరుగుతనే వానికి లాభం, వాని సరుకుల పేర్లు సదువుటాని కన్న సదువు రావాలె అని ప్రత్యేకంగా అందరికి సదువు రావాలని గ్రాంట్లు ఇస్తున్నట్టె అందరు తినగలిగేటట్టు గూడ ఏదో చేయక తప్పది. మధ్య మునిగేది మధ్యతరగతి సుఖాలు, ఈ దేశ చిన్న పెద్ద పారిశ్రామికవేత్తలు, అందుకే గవాల్లే ఇంత లొల్లి చేస్తున్నరు. వాళ్ల సుఖాల కోసం పేదోల్లు మరింత పేదోల్లయితరని బూచి చూపిస్తున్నరు" అన్నాడు ఎల్లాకర్.

"బావా! ఎల్లాకర్ వాదన దుర్మార్గం, ఈ దేశాన్ని అమ్మెటోల్లను సమర్థిస్తున్నరు" రాజేశ్వర్ తన వాదన విన్పించిండు. ఇది గూడ రాజేశ్వర్ సొంతవాదన కాదు. ఎల్లాకరే ఎప్పుడో నూరిపోసింది. అయనకే అప్పగించిండు.

"బీసీలకు అన్ని రంగాల్లో రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీల తీరు పూర్తి స్థాయిలో రాజకీయ రిజర్వేషన్లీయకుండా కులం ఈ దేశంలో అంతర్గత ప్రథమ శత్రువు అని కుల వివక్ష పరిష్కరించకుండా గ్లోబలైజేషన్ ఒక్కటే మాట్లాడే ప్రతి ఒక్కడు నా దృష్టిలో దేశద్రోహి. ఎందుకంటే యిది మెజారిటీ ప్రజల సమస్య. దేశమంటే మెజారిటీ ప్రజలే గనుక. ఈ దేశాన్ని అమ్ముతున్నది అగ్రకుల పాలవర్గాలే. వాల్లను ముందుగల్ల గద్దె దించాలని చెప్పకుండ, పోరాడకుండ ఏం మాట్లాడినా దేశద్రోహం కన్న పాపం".

"ఇంకా కులం ఎక్కడున్నదయ్యా!" అన్నది విజయలక్ష్మి. తాను రాజేశ్వర్‌తో చేస్తున్న సంసారం కులాంతరమే. మాకీ కులం అడ్డం కాలేదని ఆమె ఉద్దేశం.

ఎల్లాకర్‌ను మెప్పించి ఒప్పించడం ఎవరితరం?

"గెయిల్ ఒంవెద్ అనే అమెరికన్ రచయిత్రి ఇండియాలో స్థిరపడ్డది. ఆమె ఈ విషయం గురించి ఆరేడేండ్ల నుంచి ఎన్నో వ్యాసాలు రాసింది. మొన్ననే నాకొకాయనిచ్చిండు. జిరాక్సు చేసుకొని మీరు గూడ సదువుర్రి" అని ఉచిత సలహా పారేసిండు ఎల్లాకర్. మేం చదువంటేనే నిద్రస్తందనే బాపతని వానికి తెల్సు. రాజేశ్వర్ అప్పట్నుంచి ఎల్లాకర్‌తోని మాట బందు జేసిండు. ఎల్లాకర్ బాగ బాధపడ్డడు. గింత దానికి చేసిన మేలు మర్చి మాటలు బందు చేయాల్నా అని.

తర్వాత కొంత కాలానికి రాజేశ్వర్‌కు కోర్టు ద్వారా విడాకులు మంజూరైనై.

నెలనెలా సగం జీతం అమెకు పంపడం యాడాదికే విసుగచ్చింది. కాని కాలం వెనుకకు రాదు గదా! విజయలక్ష్మి సంపాదన మీద, ఖర్చుల మీద పెత్తనం మొదలు పెట్టిండు. ఆమె ముందే దెబ్బదిన్న మనిషి. అనుమానంగ జూసింది. అతడచ్చే యాల్లకు ఎవరింటికో పనున్నట్టు రాత్రయ్యేదాక పోయేది. చన్నీల్ల స్నానాలు మొదలు పెట్టింది. తనకు తన పిల్లలు, వారి భవిష్యత్తే ముఖ్యం తనను తాను అదుపులో పెట్టుకున్నది.

దొంగకు తేలు కుట్టినట్టు రాజేశ్వర్ ఎవరికి చెప్పుకోలే. మొదటి భార్య సాధనకు నెలనెల పంపడం ఎందుకన్న కసితో ఉద్యోగానికి రాజీనామా చేసిండు. నెలనెల పంపుడు బందు చేసిండు. ఆమె మల్లా కోర్టుకు పోయినంక చూస్తతియ్యి అని ఊరుకున్నడు.

ఆమె మా శారదను ఆశ్రయించింది. అప్పటికి ఆమెకు మొగున్ని యిడ్సి పెట్టినంక తల్లిగారింటి కాడ ఎంత సుఖంగా ఉన్నదో ఎంత గౌరవం ఉంటదో అర్థమైపోయింది. తల్లిగారోల్లను చూసుకొని గర్వానికి పోతే జీవితం ఎంత నరకమైపోయె అని బాధపడ్తున్నది. మా శారదతోని చెప్పుకొని గోదుగోదున ఏడ్చింది. ఎంతైనా ఆమె మా శారదకు తమ్ముని భార్యేనాయె. పానం గొట్టుకున్నది. కొన్నొద్దులు మా యింట్లనే ఉండుమన్నది. తమ్మునితోని మాట్లాడతనన్నది. ఇక్కన్నే కిరాయికి తీసుకొని ఉంది. పిల్లలను ఇక్కన్నే సదివియ్యి. తల్లిగారోల్లయినా వాల్ల మీద ఆధారపడనంత వరకే మంచిగా చూస్తరు అని సముదాయించింది. బతుకు గిట్ల ఉంటదని తెల్సుంటే మావోల్లు ఎక్కిచ్చినకొద్ది ఎక్కి విడాకుల కాడికి పోకపోదు అని కన్నీరు పెట్టింది. మా శారద గూడా తమ్ముని బతుకును, మరదలు బతుకును తలుచుకొని కన్నీరు పెట్టింది.

ఓ రోజు శారద సాధనతోని వంటలు చేయించి తమ్మున్ని బోయినానికి పిల్చింది. సాధన సాటుకుండిపోయింది. రాజేశ్వర్ వంట సూపరున్నదని

లొట్టలేసుకుంట తిన్నడు. వాల్లనిద్దర్ని యింట్ల వుంచి మా శారద మేం సిన్మాకని బయలెల్లినం.

అట్ల మల్ల మంచి మాట కల్సింది. ఇపుడు సాధన మా యింటి దగ్గర్నే కిరాయికుండి పిల్లలను చదివిస్తంది. రాజేశ్వర్ ఆమె యింటికి తాపకోసారి వచ్చి పోతున్నడు.

"బాబాయి ఈ మధ్య ఇంటికస్తలేవేంది! అమ్మ నిన్ను ఊకే యాది జేస్తంది" అంటూ విజయలక్ష్మి చిన్న కూతురు రాజేశ్వర్‌నడిగే సరికి మనుసున పట్టలేదు.

రాజేశ్వర్ ఎల్లాకర్‌ను కల్సిండు. ఆ రోజు గ్లోబలైజేషన్ గురించి మీరన్నదాన్లో పాయింటున్నదన్నడు. మొత్తానికి మల్లా ఎల్లాకర్‌ను ప్రసన్నం చేసుకున్నడు. గీతాకారుడిలా అన్నిటికి నేనున్న అని ఎల్లాకర్ అభయమిచ్చిండు. ఎల్లాకర్ నన్నడిగిండు, శారదనడిగిండు. ఈ విషయాలల్ల మాకేం అనుభవం ఉందని? ఇలాంటి సంఘటనలు వినుడు, చూసుడు ఇదే మొదటిసారి. మా శారద చిన్నమ్మ లలితది సెటిలైపోయిన సమస్య. ఇదేమో తిరగపెట్టిన సమస్య. ఏం సమజు గాలే.

"అరె వెంకులూ! నాగ్గూడ ఏం తోస్తలేదు. అంత మన మంచికే అనుకోవాలే. విడిపోయిన భార్యాభర్తలు మల్ల కల్సుకున్నరు. వాల్లకు ఈ నడుమ ఎన్నో అనుభవాలచ్చినై గనుక ఇక నుంచి ఎంతో అన్యోన్యంగ ఉంటరు. శారదా! మరి మీ మరదలు సాధన రాజేశ్వర్‌కు విజయలక్ష్మితో ఉన్న సంబంధాన్ని సూసి సూడనట్టుంటే ఏ లొల్లి లేదు. అందరు మంచిగనే కామన్‌వెల్త్ దేశాల తీరు కల్సి ఉండచ్చు" అని మల్లీ ఎల్లాకరే అన్నడు.

"శారదా! బ్రిటిష్ పాలన నుండి స్వతంత్రం పొందిన దేశాలు కల్సి పెట్టుకున్న సంఘమే కామన్‌వెల్త్. బ్రిటిషోల్లు పోయినా వాల్లిచ్చిన సంస్కారం పోలేదు. వాల్లిచ్చిన సంబంధాలూ పోగొట్టుకోదల్చుకోలేదు. అట్లా కామన్‌వెల్త్ దేశాల కూటమి ఏర్పడింది. అట్లనే ఈ గ్లోబలైజేషన్, పితృస్వామికం తెచ్చే మార్పులు, సంస్కారం, సంబంధాలు గూడా అనివార్యంగానే కొనసాగుతయి. పితృస్వామ్య వ్యవస్థున్నంత కాలం శుక్రనీతి పద్ధతిలో ఈ సర్దుబాట్లు తప్పయి, శారదా!" ఎల్లాకర్ ఏం చెప్పినా హేతుబద్ధంగనే కనవడ్తది.

రెండేండ్లు అట్ల అంత మంచిగనే సాగింది. చిన్న చిన్న వ్యాపారాలు, ఉద్యోగాలు చేసి రాజేశ్వర్‌కు విసుగచ్చింది. కంప్యూటర్ నేర్చుకొని ఉద్యోగం వెతుక్కుంట అమెరికాల పడ్డడు. నెలనెలా డబ్బులు పంపుతున్నడు. వాటిని, కుటుంబాన్ని సంరక్షించే

బాధ్యత రాజేశ్వర్ ఎల్లాకర్ మీదనే పెట్టిండు. యాడాదిన్నరకు ఇండియా వచ్చిన రాజేశ్వర్ దర్టీ ఇండియా, దర్టీ ఇండియన్స్ అని తిట్టుడు మొదలు పెట్టిండు. స్నేహితులందరికి ఓ రోజు మంచి బోయినాలు పెట్టిండు. రాజేశ్వర్ ఇండియాకచ్చే సరికి విజయలక్ష్మి కొడుకు బీటెక్ ఫైనల్కచ్చిండు. చిన్నది బియస్సీ కంప్యూటర్ చేస్తున్నది. ఎల్లాకర్ కూతురు ఎంసెట్ల ఫ్రీసీటు కొట్టింది. సాధనకు పుట్టిన పిల్లలు టెంతు, యింటర్కచ్చిన్రు. వాల్లు ఇండియాల్నే చదువుతున్నా వాల్ల ఆలోచనలన్ని అమెరికా సుట్టే తిరుగుతున్నై. గ్లోబలైజేషన్ను, అమెరికాను అంత ద్వేషించిన రాజేశ్వర్ ఇట్లా మారిండేందని ఆశ్చర్యమనిపించింది. ఎల్లాకర్కు అదేమి విచిత్రమనిపించలేదు.

"అరే వెంకులూ! ఇన్ల ఆశ్చర్యం ఏమున్నది? ద్వేషించడం అనేది కోరుకోవడం యొక్క వ్యతిరేక రూపంరా! నువ్వు బాగా దేన్నయినా ద్వేషిస్తున్నవంటే దాన్ని మరో తీరుగ నువ్వు కోరుకుంటున్నవని అర్థం. ద్రాక్ష పండ్లు అందనప్పుడు పుల్లన అని ద్వేషిస్తరు. అందితే తింటరు. అక్రమ సంబంధాలు గూడా గంతే. వాల్లు ఎంత ద్వేషిస్తున్నరో వాల్లన్ల అన్న పద్తమేమో అనే ఆ కోరిక వల్ల కలిగే భయం గంత ఉన్నదని అర్థం. ద్వేషించేదే స్వీకరించడం అనివార్యమైనపుడు అదే జీవితంలో భాగమైనపుడు ప్రేమించడం అలవాటైతది. మంది ముడ్డి కడుగుమంటే నీకెంత కోపం వస్తది కాని తల్లి తప్పది కనక కడుగతది, ప్రేమిస్తది. అధికారాన్ని ఎందరో ద్వేషిస్తరు. అది అందివస్తే ఊకుంటరా! దాన్నే ప్రేమిస్తరు. అలవాటు పడతరు. ఇది లోక సహజం. రాజేశ్వర్ గూడ అంతేరా!" అని జగవద్గీత బోధించిండు ఎల్లాకర్.

రాజేశ్వర్ కొద్ది రోజులుండి అమెరికా పోయిండు. పోయిపోయి రాజేశ్వర్ సంపాదన ఎల్లాకర్ సంసారానికే ఎసరు తెచ్చింది. ఎల్లాకర్ భార్య రాగరాణి గులుగుడు మొదలు పెట్టింది. మనం యిక్కడ యాడాదంత కష్టపడ్డ సంపాదన రాజేశ్వర్ సంపాదనలో నెల జీతంల సగం గాదు. నువు గూడ పాస్పోర్టు తియ్యి, వీసా సంపాయించు" అని ఉప్పిచ్చుడు మొదలు పెట్టింది. ఎల్లాకర్ కూతురు రమ్య అవన్ని వింటనే ఉన్నది. తల్లీ బిడ్డల ఆశలేంటియో అర్థమయితనే ఉన్నయి. తన ఇల్లు జాగలు మొత్తం అమ్ముకున్నా బిడ్డకు అమెరికా సంబంధం చూడలేదు.

అంతదాకా గ్లోబలైజేషన్ను, అమెరికాను సమర్థించిన ఎల్లాకర్ ఒక్కసారిగ తిరగబడ్డడు. "వాల్లకు చరిత్ర లేదు. సంస్కృతి లేదు. రెడ్ ఇండియన్స్ అని పిలిచిన అక్కడి స్థానిక జాతులను, కోట్లాది మందిని ఊచకోత కోసి ఖండాలకు ఖండాలే ఆక్రమించుకున్న రక్తపిపాసులు. ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా, ఆసియా ఖండాలను

మన రాష్ట్రమంత జనాభా లేనోల్లు అక్రమించుకొన్నరు. ఆసియాకా పీడవోయినా ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా ఖండాలు విముక్తం కాలేదు. చరిత్రను వక్రీకరించిన అధికార మదాంధులు, యుద్ధ వ్యాపారులు, ఉత్తబేకార్‌గాల్లు. అమెరికాయే ఆర్థిక సంక్షోభంల నిండ కూరుకుపోయింది. అక్కడికి మనం పోయేదేంది. అది కర్రపెత్తనంతోని, కరెన్సీ పెత్తనం తోటి, ఆయుధ బలంతోటి నెగ్గుకస్తంది. డాలర్‌తో జరిగే మారకవిలువల అవకతవకలతోని అది బతుకుతాంది. మన రూపాయితోని డాలర్ నిజమైన విలువ అయిదు రూపాయల కన్న ఎక్కువ లేదు. మన గవర్నమెంట్‌కు చాతగాక చచ్చుదద్దమ్మయి డాలర్‌కు నలభయి అయిదు, యాభయి రూపాయల దాకా రూపాయి విలువ దించి కూసున్నది. నీకు తెల్సా! స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన రూపాయి బ్రిటిష్ పౌండు, అమెరికా డాలర్ కన్న కొంచెం ఎక్కువే ఉండే. మన రూపాయి విలువను దించి నాశనం జేసింది మనోల్లే” ఇట్లా తిట్టిన తిట్టు తిట్టకుండ తిట్టిండు ఎల్లాకర్.

యాడాది తిరగక ముందే రాజేశ్వర్ విజయలక్ష్మి కొడుకు నవనీత్‌ను అమెరికా పిలిపించుకున్నడు. నవనీత్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నడు. వాడికి మా శారద, సాధన, విజయలక్ష్మి కల్సి సంబంధాలు జాడదీస్తున్నరు. ఎల్లాకర్ ఎందుకో మా యింటికచ్చుడు, ఫోన్లు జేసుడు బంద్ జేసిండు. వాల్లింట్ల ఏం లొల్లి అయిందో తెలవనిస్తలేడు.

నవనీత్ అమెరికా పోయినంక ఏమైందో గాని సాధన, విజయలక్ష్మి ఒక్కింట్లకు మారిన్రు. విజయలక్ష్మి సిటికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నది. తర్వాత అందరు హైద్రాబాద్ షిఫ్టయి ఒకటే అపార్టుమెంట్ల ఉంటున్నరు.

ప్రతి చిన్నదానికి మా మీద ఆధారపడ్డోల్లిపుడు స్వంతగా బతుకుతున్నరు. ఏదో పనికో, పైసల అవసరానికో మేమే వాల్ల మీద ఆధారపడుడు మొదలైంది. ఎల్లాకర్ భార్య రాగరాణి ఒక్కతే పోయి సాధనను, విజయలక్ష్మిని కల్సి రెండు రోజులక్కన్నే ఉన్నది. తెల్సిన పిల్లను చేసుకోవాలె. దూరపు పిల్ల ఎట్లుంటదో ఎవలకెరుక అని తను చెప్పదల్చుకున్నదంత చెప్పింది. సాధన, విజయలక్ష్మి రాజేశ్వర్‌తో ఫోన్‌ల మాట్లాడిన్రు. కొడుకు నవనీత్‌ను అభిప్రాయమడిగిన్రు. ఎల్లాకర్ కూతురు రమ్య కండ్ల ముంగిట పెరిగిన పిల్ల. ఇంజనీరింగ్ గూడ చేసింది. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకొని బతుకుతరు. కట్నందేమున్నది. పిల్ల యాడాదిల అంతకు డబల్ సంపాయిస్తది అని చర్చించుకున్నరు. పిల్లను ఖాయం చేసుకున్నంక ఎల్లాకర్ మల్ల మాటలు కలిపిండు. వాని స్వార్థం వానిది.

నవనీత్‌కు పెండ్లి కుదిరినంక రాజేశ్వర్‌ను డాడీ అని ఫోన్లో పిలవడానికి ఎవలకు అభ్యంతరాలు లేకుంటైనై. రాజేశ్వర్, విజయలక్ష్మి కల్సి పెండ్లి కొడుకు తల్లిదండ్రులైన్రు. సాధన తన సొంత కొడుకు పెండ్లి తీరే హడావిడి పడిపోయింది. ఎల్లాకర్ కండ్లల్ల నీల్లు తిరిగినై.

"అరే వెంకులూ! ఇవి కన్నీల్లు గాదురా! ఆనంద భాష్పాలు. నేను అమెరికా సంబంధం కలలోనన్న ఊహిస్తునా! నవనీత్ అమెరికా పోతదని ఎవలమన్న కలగన్నమా! వాళ్ల నాన్న ఆ తాగుబోతు పోషేందర్ బతుకుంటే నవనీత్ టీచరన్న అవుతుండెనంటవా! ఆ దెబ్బలకు విజయలక్ష్మి ఎప్పుడో సచ్చిపోవు. నవనీత్ ఇంటర్ ఫెయిలై ఏగి తిరుగు. ఏమంటవురా!" అని అడిగిండు ఎల్లాకర్. ఇంత సంతోషంలో గూడా వాడు తన తర్కదృష్టి, సత్యదృష్టి పోనిచ్చుకోలేదేందని ఆశ్చర్యం కలిగింది నాకు.

"చేసిన మేలు ఎప్పటికీ వృధా పోదురా. కాస్త ముందు వెనక గంతే నీ మంచితనమే నీకు మేలు జేసిందిరా" అని ప్రశంసించిన.

పెండ్లయినంక ఇరవై రోజులకే నవనీత్, ఎల్లాకర్ బిడ్డ రమ్య, రాజేశ్వర్ అమెరికా ప్రయాణమైన్రు. ఆఘమేఘాల మీద రమ్యకు వీసా తీసుకచ్చిండు నవనీత్.

ఫ్లయిట్ ఎక్కేదాక వెంట వుండి అందరం కల్సి సాగనంపినం.

రాత్రి యింటికచ్చినంక నా పిల్లల భవిష్యత్తు మీద రంధి ఎక్కో అయింది. ఆలోచనల్ల పడ్డ.

"బోయినానికి రమ్మంటే ఈన్నే ఉన్నవేందిరా" అంటు వచ్చిండు ఎల్లాకర్.

"ఏందిర గంత దీర్ఘంగ ఆలోచిస్తున్నవు. శారద మన పిల్లలకెట్లయితదో అని అన్నందుకు రంది పెట్టుకున్నవా? అన్ని మనం ఊహించినట్టు జరగయి. అట్ల జరుగుతే ఆదిమానవుల దశలనే ఉందుంటిమి మనం. ఎందుకంటే మన ఊహ మన అనుభవాలను మించి ముందుకు సాగలేదు గదా" అన్నడు ఎల్లాకర్.

"అది గాదురా! విజయలక్ష్మి సాధన సొంత అక్కచెల్లెండ్ల తీరు ఎంత మంచిగ కల్సిపోయిన్రు. చూస్తుంటే నాకెంతో సంతోషంగా ఉన్నదిరా" అని విషయం మార్చిన.

ఎల్లాకర్ గీతాకారుడిలా ఫోజు పెట్టి అన్నడు.

"అరేయ్ వాల్లు కామన్‌వెల్త్ దేశాల వంటివాల్లురా! వాల్లు కల్సే ఉంటరు. దోపిడి చేసే అమెరికా చేయబడే ఇండియా గూడ ఇప్పటి తీరు రేపు గూడ వీల్ల

థీరే కల్సి ఉంటరు. అట్ల కల్సి ఉండుటానికి ఎప్పటి అవసరాలు అప్పటికి పుట్టుకస్తనే ఉంటయిరా వీళ్లకు పుట్టుకచ్చినట్టు"

"నా బాధ అది గాదురా! మేధో వలస గురించి నా బాధ" అంటూ గునిగిన.

"అరే వెంకులూ! అందని ద్రాక్ష పండ్లు పుల్లన అని థీరీ చేయకురా. మేధోవలస సాగితేంది? వాల్లు సరుకులు ఎగుమతి చేస్తే మనం మనుషులను ఎగుమతి చేస్తున్నం. సరుకుల కన్న మనుషులే గొప్ప గదా! యూరపు అమెరికాల సంపదంతా ప్రపంచ మానవాళి కామన్‌వెల్త్‌రా! నాలుగు వందలేండ్లు ఆసియా, ఆఫ్రికా దేశాలను దోచి ఎదిగిన సొమ్మురా అది. రామ్మనోహర్ లోహియా చెప్పింది చదువురా. రెడ్ ఇండియన్స్ నుండి గుంజుకున్న అమెరికా యూరోపోల్ల గుత్త సోమ్మా యేందిర! అది మనందరిది. ఆస్ట్రేలియా కూడా మనందరిది. వాల్ల తీరు మనం గూడ అక్కడికి వలస పోతేనే అవి మనవైతయి. అన్ని జెప్పిండు గని రామ్మనోహర్ లోహియా ఈ దేశంలోని ఓసీల సంపదంతా వేల ఏండ్ల బీసీల కామన్‌వెల్త్ అని మాత్రం చెప్పలేదు. అరే వెంకులూ! నీ పిచ్చిగని సరుకుల గ్లోబలైజేషన్ అంటే ఏందిరా? సరుకుల గ్లోబలైజేషన్ శ్రమశక్తి గ్లోబలైజేషన్‌రా! శ్రమశక్తి గ్లోబలైజైనంక శ్రామికుల గ్లోబలైజేషన్ ఎంత సేపురా? సరుకులను గ్లోబలైజ్ చేసినంక మనుషులు గ్లోబలైజ్ కాకుంట ఉంటార్ర? అది ఎట్లనో ఒకట్ల విశ్వమానవ కుటుంబానికి దారి దీయక తప్పది" అన్నడు ఎల్లాకర్.

నాకు నోట్లె మాట రాలేదు. వాని బిడ్డ రమ్య, అల్లుడు అమెరికాకు పోతే గాదు గని వాని అభిప్రాయాలన్ని మారుతున్నయి. ఈ మాట వానితో అంటే "అందని ద్రాక్ష పండ్లు పుల్లన అని థీరీ చేయకురా" అని తిడుతడని నోరు మూసుకున్న.

"పద మన కోసం ఆడోల్లు తినకుంట ఎదిరి చూస్తరు" అని బోయినానికి బయల్దేరిన.

(వరంగల్‌లో 21-10-2001న అంబటి సురేంద్రరాజు నిర్వహణలో జరిగిన తెలంగాణ సాంస్కృతిక వేదిక సభలో వీడ్కోలు తీసుకుంటు "రాములూ, కాలువ మల్లయ్య, ప్రతాపరెడ్డి మీరు తెలంగాణా భాషల్నే రాయిన్రి, భాషపోతే సంస్కృతి లేదు. ఏదీ లేదు. మన భాషను కాపాడున్రి" అని కంట తడితో ఆర్ద్రంగా కోరిన కాళోజీగారికి ప్రేమతో)

**ప్రజాశక్తి ఆదివారం, 6 జనవరి,13 జనవరి 2002**

**దట్స్ తెలుగు డాట్ కామ్, 2002**